ఎన్డీఎస్ఏ నివేదికపై క్యాబినెట్‌లో చర్చిస్తాం

- ఆ తరువాతే కాళేశ్వరంపై ముందుకెళ్తాం: ఉత్తమ్‌కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఇటీవల సమర్పించిన నివేదికపై క్యాబినెట్‌లో చర్చిస్తామని, ఆ తరువాతే తదుపరి చర్యలపై ముందుకు వెళ్తామని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై అధ్యయనం చేసిన ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ ఇటీవలనే 378 పేజీల నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్డీఎస్ఏ నివేదిక అనేక అంశాలను, బరాజ్‌లకు సంబంధించిన నిర్మాణ లోపాలను వెల్లడించిందని తెలిపారు. నివేదికను అనుసరించి బరాజ్‌లను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత ఉన్నదని చెప్పారు. నివేదికపై మంత్రిమండలిలో చర్చిస్తామని, సాంకేతిక నిపుణులను సంప్రదించి బరాజ్‌ల పునరుద్ధరణకు భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తామని వెల్లడించారు. మేడిగడ్డ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని, దానిపై రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. వాటర్ మేనేజ్‌మెంట్, ల్యాండ్ ట్రైనింగ్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(వాలంతరి) సాంకేతిక శిక్షణ సంస్థను బలోపేతం చేసి ఇంజినీర్లకు శిక్షణ ఇస్తామని తెలిపారు. తమ్మిడిహెట్టిని ఆధారం చేసుకుని ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే అంశంపై నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ అధ్యయనం చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తప్పిన విద్యుత్తు చార్జీల భారం

- పెంపులేదని ప్రకటించిన ఈఆర్సీ
- ప్రస్తుతానికి పాత టారిఫే
- మే 1 నుంచి కొత్తది అమల్లోకి
- ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్తు వినియోగదారులపై చార్జీల భారం తప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి చార్జీల పెంపులేదని విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ) మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు టారిఫ్ ఆర్డర్‌పై ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున మంగళవారం సంతకం చేశారు. ప్రస్తుతానికి పాత టారిఫే అమల్లో ఉంటుందని, కొత్త టారిఫ్ మే 1 నుంచి అమల్లోకి వస్తుందని జస్టిస్ నాగార్జున వెల్లడించారు. కొత్త ఆర్థిక సంవత్సరానికి అగ్రిగేట్ రెవెన్యూ రిక్వెస్ట్ (ఏఆర్ఆర్)పై విద్యుత్తు సంస్థలు దాఖలు చేసిన మొత్తం 8 పిటిషన్లపై విచారణ జరిపిన ఈఆర్సీ టారిఫ్ ఆర్డర్‌ను ఆమోదించింది. ఈ సందర్భంగా ఎర్రగడ్డలోని విద్యుత్తు నియంత్రణ భవన్‌లో ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున ఈఆర్సీ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. డిస్కంల రెవెన్యూ లోటు రూ.13,499 కోట్లుగా ఉండగా, ఈ మొత్తాన్ని సబ్సిడీ రూపంలో అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ప్రస్తుతానికి చార్జీలను పెంచడం లేదని తెలిపారు. లో టెన్షన్ (ఎల్‌టీ) -9వ క్యాటగిరీలోని ఈవీ చార్జింగ్ స్టేషన్ల లోడ్ లిమిట్‌ను 150/201 హెచ్‌పీకి పెంచారు. గ్రిడ్ సపోర్టు చార్జీలను నెలకు ఒక కిలోవాట్‌కు రూ.18.48ల నుంచి రూ.20.02కు పెంచారు.

డిస్కంల ఆర్థిక పరిస్థితి బాగాలేదు..

రాష్ట్రంలోని విద్యుత్తు పంపిణీ సంస్థల ఆర్థిక పరిస్థితి బాగాలేదని ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున ఆందోళన వ్యక్తంచేశారు. బకాయిలు పేరుకుపోతున్నాయని, మరీ ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు తీవ్ర సమస్యగా మారినట్టు తెలిపారు. బకాయిలను వసూలు చేయడమో.. లేక సర్కారు చెల్లించడమో చేయాలని పేర్కొన్నారు. విద్యుత్తు సంస్థలు ట్రాన్స్‌మిషన్, కమర్షియల్ నష్టాలను తగ్గించుకోవాలని సూచించారు. వినియోగదారులకు అందుతున్న సేవలపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ట్రాన్స్‌ఫార్మర్లను మార్చడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని వెల్లడించారు.

ఎన్డీఏ జేబు సంస్థగా ఎన్డీఎస్ఏ

- ఎన్డీఎస్ఏ నివేదిక రాజకీయ ప్రేరేపితం
- పోలవరం కూలి ఐదేండ్లయినా అటువైపు కన్నెత్తి చూడని ఎన్డీఎస్ఏ
- బ్లాక్ నంబర్ 7 తిరిగి కట్టడం ద్వారా మేడిగడ్డను ఉపయోగంలోకి తీసుకొచ్చి సాగునీరు అందించాలి
- రాజకీయాల పేరిట అన్నదాతల గొంతు కోయాలని చూడొద్దు
- యుద్ధప్రాతిపదికన కాళేశ్వరం ప్రాజెక్ట్ మరమ్మతులు చేపట్టాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్, ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, చింతా ప్రభాకర్, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): ఎన్డీఏ ప్రభుత్వ జేబు సంస్థగా ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రాథమిక, పార్లమెంట్ ఎన్నికల సమయంలో మధ్యంతర రిపోర్టు, బీఆర్ఎస్ రజతోత్సవం వేళ తుది రిపోర్టు ఎన్డీఎస్ఏ విడుదల చేయడం వెనుక బీజేపీ, కాంగ్రెస్ కుట్ర ఉన్నదని మండిపడ్డారు. భారత్ సమ్మిట్, రైతు మహోత్సవాల నిర్వహణతోపాటు ఆర్టీఏ అధికారులతో వాహనదారులను వేధింపులకు గురిచేసినా, ఎన్ని అడ్డంకులు సృష్టించినా బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతమైందని చెప్పారు. ఊరువాడా, పల్లె పట్టణం అంతటా కేసీఆర్ ప్రసంగంపైనే చర్చ జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎన్డీఎస్ఏ రిపోర్టును అడ్డంపెట్టుకొని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పచ్చి అబద్ధాలు, అసత్యాలు దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. ఎన్డీఎస్ఏ ఏర్పాటు బిల్లును కాంగ్రెస్ పక్షాన లోక్‌సభలో వ్యతిరేకించిన ఇదే ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బీఆర్ఎస్ మీద విమర్శలు చేయడానికి ఇవాళ ఎన్డీఎస్ఏ రిపోర్టు భగవద్గీత, ఖురాన్, బైబిల్ లాగా కనపడుతున్నదని విమర్శించారు. మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదని, కానీ, అవినీతి జరిగిందని చెప్పడానికి ఉత్తమ్ ప్రయాసలు చూస్తే జాలేసుందన్నారు.

> కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి మేం అప్పులు తెచ్చాం. మీలాగా బ్రోకర్‌కు పైసలు ఇచ్చి తేలేదు. అప్పు తేవడానికి లంచం ఇచ్చిన సర్కారు రేవంత్ సర్కారు. ఇంతకంటే దివాలాకోరుతనం మరొకటి ఉండదు.
>
> - హరీశ్‌రావు

> ఎన్డీఎస్ఏ ఏర్పాటు బిల్లును కాంగ్రెస్ పక్షాన లోక్‌సభలో వ్యతిరేకించిన ఇదే ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బీఆర్ఎస్ మీద విమర్శలు చేయడానికి ఇవాళ ఎన్డీఎస్ఏ రిపోర్టు భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా కనపడుతున్నది. మేడిగడ్డ నిర్మాణంలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదు.
>
> - హరీశ్‌రావు

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పుబట్టిన ఎన్డీఎస్ఏ

ఎన్డీఎస్ఏ నివేదిక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పుపట్టిందని, బ్లాక్ 7 తిరిగి కట్టడం ద్వారా మేడిగడ్డ ప్రాజెక్టును ఉపయోగంలోకి తీసుకురావచ్చని చెప్పిందని హరీశ్‌రావు తెలిపారు. రాజకీయాల పేరిట రైతుల గొంతు కోయవద్దని, తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలు ఎంతో ఉన్నాయని, వర్షాలు లేకుంటే మంచి నీళ్లు కూడా దొరకవని, వేగవంతంగా ప్రాజెక్టును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సునీతాలక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌తో కలిసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ సర్కారుపై మంత్రి ఉత్తమ్ చేసిన ఆరోపణలు ఒక్కోదానికి ఎన్డీఎస్ఏ రిపోర్టులోని అంశాలు, పేరాలు, పేజీలు, ఆధారాలతో సహా సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ వైఫల్యాన్ని, అబద్ధాలను పూసగుచ్చినట్టు వివరించారు. ఎన్డీఎస్ఏ నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్, గైడ్‌వాల్ కుప్పకూలిందని, నాలుగైదేండ్లు అయినా పోలవరానికి ఎన్డీఎస్ఏ ఎందుకు పోలేదని ప్రశ్నించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సంస్థగా ఎన్డీఎస్ఏను ఉత్తమ్ అభివర్ణిస్తున్నారని మండిపడ్డారు.

ఎస్ఎల్‌బీసీ కంటే పెద్ద డిజాస్టర్ ఏముంది?

మంత్రి ఉత్తమ్ మేడిగడ్డ ప్రాజెక్టును డిజాస్టర్ అనడంపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. ఎస్ఎల్‌బీసీ కంటే పెద్ద డిజాస్టర్ ఏముందని, 60 రోజులైనా ఎనిమిది మృతదేహాలను ఎందుకు బయటకు తీసుకురాలేకపోతున్నారని ప్రశ్నించారు. 'మహారాష్ట్ర, ఏపీ, ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండి కూడా తమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు ఎనిమిదేండ్లలో అనుమతులు ఎందుకు తీసుకురాలేకపోయారు? అంతర్ రాష్ట్ర ఒప్పందం ఎందుకు చేయలేకపోయారు? ఇది కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కాదా? మీరు పెట్టిన ఖర్చు వృథా అవుతుందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి అప్పటి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అయినా, కమీషన్ల కోసం, పర్సెంటేజీల కోసం టెండర్లు పిలిచి, ఎక్కడో చేవెళ్ల కాడ తవ్వారు. నాలుగేండ్లలో పూర్తవుతుందని చెప్పి ఏండ్లయినా చేయలేకపోయారు. సిగ్గులేదా? తలకాయ ఎక్కడ పెట్టుకుంటారు ఉత్తమ్' అని ప్రశ్నించారు. సర్వే మొబిలేజేషన్ అడ్వాన్స్ పేరిట 1,426 కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చారని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతికి పరాకాష్ఠ అని, ఈ తప్పును బీఆర్ఎస్ ప్రభుత్వం సరిచేసిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల సర్వే నివేదికల ఆధారంగా, సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు దృష్టిలో పెట్టుకొని తమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చామని చెప్పారు.

ఆరు ఎకరాలకైనా నీళ్లు ఇచ్చారా?

ఆరు ప్రాజెక్టులు పూర్తి చేసి, ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు చెప్పారని, ఇప్పటివరకు ఆరు వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. పెద్దవాగు తెగిపోయింది. ఎస్ఎల్‌బీసీ కుప్ప కూలింది. వట్టెం వాగు కొట్టుకుపోయిందని విమర్శించారు. తెలంగాణ నీటి పారుదలశాఖ ఎంత దీన స్థితిలో ఉందో ఆశాఖలో ఖాళీలను చూస్తే తెలుస్తుందన్నారు. సెక్షన్ 3 నదీ జలాల మీద ట్రిబ్యునల్‌లో వాదనలు జరుగుతుంటే, పూర్తిస్థాయి సీఈ, ఎస్ఈ లేక డిప్యూటీ ఈఈ మాత్రమే హాజరవుతున్నారని, ఆయన ఫ్లైట్‌లో వెళ్లి బిల్లులు పెట్టుకొంటే నేటికీ క్లియర్ కాలేదని మండిపడ్డారు.

కొడంగల్ లిఫ్టుకు డీపీఆర్ ఉన్నదా?

కొడంగల్-నారాయణపేట లిఫ్టుకు ఇప్పటివరకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) ఉన్నదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. టెండర్లు పిలిచి, ప్రాజెక్టు ఎలా కడుతున్నారని నిలదీశారు. 'సమాచార హక్కు చట్టం కింద కొడంగల్ ప్రాజెక్టుకు ఇప్పటికీ డీపీఆర్ లేదని సమాధానం ఇచ్చారు. మిస్టర్ ఉత్తం.. మీకో నీతి.. మాకో నీతా? 2007 ప్రాణహితకు టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించి, వేలకోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చారు. 2010లో డీపీఆర్ సబ్మిట్ చేశారు. సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. ముందు నీ వీపు చూసుకో ఉత్తంకుమార్ రెడ్డి' అని ఫైరయ్యారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి అప్పులు తెచ్చామని, మీలాగా బ్రోకర్‌కు పైసలు ఇచ్చి తేలేదని స్పష్టంచేశారు. అప్పు తేవడానికి లంచం ఇచ్చిన సర్కారు రేవంత్ సర్కారు అని, ఇంతకంటే దివాలాకోరు తనం, దిక్కుమాలిన తనం మరొకటి ఉండదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జియాలాజికల్ సర్వే ప్రకారంగానే అన్నారం, సుందిళ్ల లొకేషన్ మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కట్టిన నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ ప్రాజెక్టు మారలేదా? పరిస్థితులు, ముంపు, అవసరాలను బట్టి మారుతాయని, హైలెవెల్ కమిటీ మేరకు డిపార్ట్‌మెంట్ తీసుకున్న నిర్ణయంపై పచ్చి అబద్ధాలు మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. కాళేశ్వరం అంటే 3 బ్యారేజీలు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంప్‌హౌజ్‌లు, 16 రిజర్వాయర్లు, 203 కిలోమీటర్ల టన్నెల్, 231 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్.. ఇవన్నీ బాగున్నాయని, కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్ నుంచి ఇప్పటికీ సాగు నీళ్లు వస్తున్నాయని, ఇవి కాళేశ్వరంలో భాగం కాదా? అని ప్రశ్నించారు. మరి లక్ష కోట్లు వృథా అయితే నీళ్లు ఎట్ల వస్తున్నయ్ అని నిలదీశారు.

పనిచేయని జీవోల వెబ్‌సైట్

- రోజంతా నిలిచిపోయిన సైట్
- కారణాలు వెల్లడించని ప్రభుత్వం

హైదరాబాద్, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ఉత్తర్వులు(జీవోలు) వెల్లడించే వెబ్‌సైట్ సేవలు నిలిచిపోయాయి. మంగళవారం ఎప్పుడు ఓపెన్ చేసినా 'ది సర్వీస్ ఈజ్ అన్‌అవెలబుల్' అని చూపిస్తున్నది. దీంతో ప్రభుత్వం వెల్లడించే ఉత్తర్వులు రహస్యంగా మారాయి. ప్రభుత్వం ఏమైనా ఉత్తర్వులు వెల్లడించిందా లేదా ఒకవేళ.. వెల్లడిస్తే వాటిని ఎక్కడ పొందుపరిచిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉత్తర్వుల వెబ్‌సైట్ నిలిచిపోవడంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కనీసం ఐటీశాఖ కూడా దీనిపై స్పందించలేదు. సాంకేతిక కారణాలతో సేవలు నిలిచిపోయాయా లేక మరే కారణంతో నిలిచిపోయిందా అనే అంశంపై స్పష్టత కరువైంది. లేదంటే ఉత్తర్వుల వెబ్‌సైట్‌ను నిలిపేసి.. తెరవెనుక ఏమైనా తతంగాలు నడిపిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డీఎస్ చౌహాన్‌తో జార్ఖండ్ మంత్రి భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు విధానం బాగుందని జార్ఖండ్ వ్యవసాయ శాఖ మంత్రి శిల్పి నేహ టిర్కీ అన్నారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆమె.. మంగళవారం సివిల్ సప్లై భవన్‌లో ఆశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు, సన్న ధాన్యానికి బోనస్, సన్నబియ్యం పంపిణీ తదితర పథకాల గురించి మంత్రికి వివరించగా, ఈపథకాలు బాగున్నాయని ఆమె అభినందించారు.

హెడ్‌కానిస్టేబుల్ కుమారుడికి అభినందనలు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ఫలితాల్లో 938వ ర్యాంక్ సాధించిన బానోత్ శ్రీనికేశ్ నాయక్‌ను డీజీపీ జితేందర్, లాఅండ్‌అర్డర్ ఏడీజీ మహేశ్ భగవత్ అభినందించారు. అతని తండ్రి బీసక్రం హనుమకొండ పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనికేశ్ గ్రూప్-1 ఫలితాల్లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కు 117ర్యాంక్‌తో ఎంపికయ్యాడని, ప్రజాసేవకు జీవితం అంకితం చేయాలని దిశానిర్దేశం చేశారు.

కాళేశ్వరం కమిషన్ గడువు పొడిగింపు

- మరో నెల పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన కమిషన్ గడువును ప్రభుత్వం మరో నెల పొడిగించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణంలో లోపాలపై విచారణ కోసం ప్రభుత్వం నిరుడు ఫిబ్రవరిలో కమిషన్‌ను నియమించింది. 100 రోజుల్లో నివేదిక సమర్పించాలని సూచించింది. ఆ తర్వాత క్రమంగా కమిషన్ గడువును పొడిగిస్తూ వస్తున్నది. నేటితో తుది గడువు ముగియనుండగా నివేదిక సిద్ధం కాకపోవడంతో గడువును మే 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిషన్ ఇప్పటికే ఆయా బరాజ్‌ల నిర్మాణంలో భాగస్వాములైన ఇంజినీర్లు, ఏజెన్సీల ప్రతినిధులను విచారించింది. ప్రస్తుతం విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికలను అధ్యయనం చేస్తుండడంతోపాటు మరికొంతమందిని విచారించి మే రెండో వారానికి నివేదిక అందించే అవకాశమున్నట్టు తెలుస్తున్నది.

కాంట్రాక్టు పద్ధతిన సీఈ బాధ్యతలు

- ఇరిగేషన్ మంత్రి ఓఎస్డీగా భీంప్రసాద్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : నాగర్‌కర్నూల్ చీఫ్ ఇంజినీర్ పోస్టును ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసింది. నాగర్‌కర్నూల్ ఇరిగేషన్ సర్కిల్-1 ఎస్ఈగా విధులు నిర్వహించి మార్చి 31న ఉద్యోగ విరమణ పొందిన విజయ్‌భాస్కర్‌రెడ్డిని సీఈగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వుల వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నట్టు వెల్లడించింది. ఇక ఇరిగేషన్‌శాఖ మంత్రి ఓఎస్డీగా విశ్రాంత ఎస్ఈ భీంప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన అడిషనల్ సెక్రటరీగా కొనసాగారు. అయితే, ఉద్యోగ విరమణ పొందిన వారిని కొనసాగించేది లేదని ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి సర్కారు.. తమ అనుయాయులకు మాత్రం మినహాయింపు ఇస్తున్నది. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఇప్పటికే 17 సీఈ పోస్టులు ఖాళీ అయ్యాయి. రెగ్యులర్ ఇంజినీర్లకు ప్రమోషన్లు కల్పించకుండా ఏడాదిగా కాలయాపన చేస్తున్నది. ఒక్కో ఇంజినీర్‌కు రెండేసి చొప్పున అదనపు బాధ్యతలు అప్పగిస్తూ చోద్యం చూస్తున్నది. దీనిపై డిపార్ట్‌మెంట్ ఇంజినీర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.

ఆర్బీఐ నుంచి 1,400 కోట్ల అప్పు

- ఈ నెలలో ఇప్పటివరకు 4,400 కోట్లు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి సర్కారు రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నుంచి మరో రూ.1,400 కోట్ల అప్పు తీసుకున్నది. మంగళవారం నిర్వహించిన ఈ- వేలం ద్వారా ఈ మొత్తం సేకరించినట్టు ఆర్బీఐ వెల్లడించింది. 27 ఏండ్లకాల పరిమితితో 6.79 శాతం వార్షిక వడ్డీకి రూ.700 కోట్లు తీసుకున్నది. మరో రూ.700 కోట్లను 31 ఏండ్లకాల పరిమితితో 6.79 శాతం వార్షిక వడ్డీకి సేకరించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.14 వేల కోట్ల రుణ సమీకరణ కోసం ఆర్బీఐకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఈ నెలలో ఇప్పటివరకు మూడు దఫాల్లో రూ.4,400 కోట్ల రుణ సమీకరణ చేసింది. ఈ నెల 8న 1,000 కోట్లు, 15న రూ.2000 కోట్లు, 29న రూ.1,400 కోట్లు ఆర్బీఐ నుంచి తీసుకున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద రూ.64,539 కోట్లు సమీకరిస్తామని బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

ఎక్స్‌టెన్షన్లపై ఇంజినీర్ల ఆగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్29 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్‌శాఖలో ఎక్స్‌టెన్షన్లపై ఇంజినీర్ల సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఈ మేరకు తెలంగాణ ఇరిగేషన్ గ్రాడ్యుయేషన్ ఇంజినీర్ల సంఘం, హైదరాబాద్ ఇంజినీర్ల సంఘం, తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల సంఘం, ఇరిగేషన్ డిప్లొమా ఇంజినీర్ల సంఘం సంయుక్తంగా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశాయి. నాగర్‌కర్నూల్ సర్కిల్-1 సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా విజయభాస్కర్‌రెడ్డికి ఎక్స్‌టెన్షన్ ఇవ్వడమే గాక, సీఈగా అదనపు బాధ్యతలు అప్పగించడాన్ని తప్పుబట్టాయి. ఎక్స్‌టెన్షన్లు ఇవ్వబోమని హామీలు ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు వాటిని తుంగలో తొక్కి మిషన్ భగీరథలో ఈఎన్సీగా కృపాకర్‌రెడ్డికి, పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో ఈఎన్సీ కనకరత్నానికి, ఇరిగేషన్‌శాఖలో విజయభాస్కర్‌రెడ్డికి ఎక్స్‌టెన్షన్ ఇవ్వడం దారుణమని ధ్వజమెత్తాయి. ఎక్స్‌టెన్షన్లతో ఏఈఈల నుంచి సీఈల వరకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశాయి. ఇకనైనా ఎక్స్‌టెన్షన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశాయి.

అబద్ధాల వరద!

మొదటిపేజీ తరువాయి...

యత్నించారు. పేరుకు ఎన్డీఎస్ఏ నివేదిక అంశాలపై ప్రెస్‌మీట్ పెట్టినా, పూర్తిగా రాజకీయ ఆరోపణలకే మంత్రి ఉత్తమ్ దిగారు. పాడిందే పాడరా.. అన్నచందంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి రీఇంజినీరింగ్, నీటి లభ్యత, నిర్మాణ వ్యయం పెంపుపై ప్రతిపక్షంలో ఉన్న నాటినుంచి చేస్తున్న ఆరోపణలనే ఏకరువు పెట్టారు. మేడిగడ్డ కూలిపోయిందని, తెలంగాణకు రూ.లక్ష కోట్ల నష్టం వాటిల్లిందని, భారీ అవినీతి జరిగిందంటూ అసత్య ప్రచారానికి మరోసారి పూనుకున్నారు.

నివేదికను వక్రీకరించి..

ఎన్డీఎస్ఏ 378 పేజీలతో నివేదికను సమర్పించింది. ఆ నివేదికలోని అన్ని అంశాలను వివరించకుండా మంత్రి ఉత్తమ్‌కుమార్ కొన్ని అంశాలకే పరిమితమయ్యారు. తమ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న పలు అంశాలను వక్రీకరించి ఆరోపణలకు దిగారు. మేడిగడ్డ, సుందిళ్ల బరాజ్ నిర్మాణాలు పూర్తిగా కూలిపోయాయని ఎన్డీఎస్ఏ నివేదిక స్పష్టం చేసిందని మంత్రి పేర్కొన్నారు. వాస్తవానికి నిర్దిష్ట పరీక్షలను నిర్వహించిన అనంతరం 7వ బ్లాక్‌ను పునరుద్ధరించాలని, తద్వారా మేడిగడ్డ బరాజ్‌ను వినియోగంలోకి తీసుకురావచ్చని ఎన్డీఎస్ఏ నివేదికలో స్పష్టంచేసింది. ఈ విషయాన్ని మాత్రం మంత్రి తొక్కిపెట్టారు. మేడగడ్డ 7వ బ్లాక్ వద్ద ఏర్పడిన సాంకేతిక సమస్యలు.. ఇతర బ్లాకుల్లో, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లో తలెత్తవచ్చని, ముందస్తుగా అందుకు సంబంధించిన పరీక్షలు నిర్వహించాలని మాత్రమే ఎన్డీఎస్ఏ ఊహాజనితమైన సలహా ఇచ్చింది. కానీ, మంత్రి ఉత్తమ్ మాత్రం మేడిగడ్డ తరహాలోనే అన్నిబ్లాకుల్లో సమస్యలు ఉన్నట్టు పూర్తిగా వక్రీకరించారు.

అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణ స్థలాలను మార్చారని, ఎలాంటి సాంకేతిక పరీక్షలు నిర్వహించకుండా, ఎవరినీ సంప్రదించకుండానే బరాజ్‌లను నిర్మించారని ఎన్డీఎస్ఏ పేర్కొన్నదని మంత్రి ఆరోపించారు. కానీ, ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి ప్రతిపాదిత స్థలాల మార్పు అనేది సహజం. గతంలో నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల ప్రతిపాదిత స్థలాలను కూడా మార్చారు. ఇదిలావుంటే, లొకేషన్ మార్చినంత మాత్రాన ఎలాంటి భూభౌతిక పరీక్షలను చేయకుండా ఏ ఇంజినీర్ కూడా నిర్మాణాలను చేపట్టరు. నిజానికి, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల లొకేషన్లను నీటినిల్వ సామర్థ్యం, ముంపు నివారణ తదితర అంశాల నేపథ్యంలోనే మార్చారు. ఆ రెండు బరాజ్‌లను నిర్మించే ప్రాంతాల్లో అన్ని రకాల సాంకేతిక పరీక్షలు నిర్వహించారు. మేడిగడ్డ వద్ద జాదవ్‌పూర్ యూనివర్సిటీ ద్వారా జియోటెక్నికల్, ఫిజికల్ పరీక్షలను నిర్వహించగా, ఐఐటీ హైదరాబాద్ వాటిని పరిశీలించింది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణానికి ముందు కూడా ఏజెన్సీలు అన్ని సాంకేతిక పరీక్షలను నిర్వహించగా, ఎన్ఐటీ వరంగల్ పర్యవేక్షించింది. ఈ అంశాలను ఎన్డీఎస్ఏ నివేదికలోనే పొందుపరిచారు. కానీ, మంత్రి ఉత్తమ్‌కుమార్ మాత్రం అందుకు విరుద్ధంగా ఆరోపణలకు దిగారు.

మేడిగడ్డ బరాజ్‌లో 7వ బ్లాక్ కుంగుబాటు ఘటనపై ఎన్డీఎస్ఏ మధ్యంతర నివేదికను గత ఏడాది సమర్పించింది. బరాజ్‌ల రక్షణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి పలు సిఫారసులు చేసింది. మార్గదర్శకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అమలు చేయలేదని, కొన్నింటిని పాక్షికంగా చేపట్టిందని, మరికొన్ని అంశాలను పూర్తిగా వదిలేసిందని ఎన్డీఎస్ఏ తన తుది నివేదికలో నొక్కిచెప్పింది. కానీ, మంత్రి మాత్రం ఆ అంశాల ఊసే ఎత్తకపోవడం గమనార్హం. మార్గదర్శకాలకు విరుద్ధంగా 7వ బ్లాక్ వద్ద గ్రౌటింగ్‌ను నిర్వహించారని, తద్వారా క్షేత్రస్థాయి పరిస్థితులను కచ్చితంగా అంచనా వేయలేమని, సాంకేతిక పరీక్షలను నిర్వహించినా ఆ ఫలితాల కచ్చితత్వం దెబ్బతింటుందని, ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న పాక్షిక సమాచారంతోనే నివేదికను ఇస్తున్నట్టు ఎన్డీఎస్ఏ తెలిపింది. ఈ విషయాన్ని, ప్రభుత్వ వైఫల్యాలను కూడా మంత్రి తొక్కిపెట్టారు. కేవలం రాజకీయ ఆరోపణలకు దిగారు. మార్గదర్శకాలకు విరుద్ధంగా గ్రౌటింగ్ ఎందుకు చేశారు? అంటే బరాజ్‌ల రక్షణకు అంటూ సమర్థించుకునే ప్రయత్నం చేయడం కొసమెరుపు. బరాజ్‌లకు సంబంధించి ఎన్డీఎస్ఏ తన నివేదికలో అనేక సూచనలు చేసింది. డాటా అందివ్వడంలో, సూచించిన సాంకేతిక పరీక్షలను నిర్వహించడంలో కాంగ్రెస్ సర్కారు వైఫల్యాన్ని, నిర్లక్ష్యాన్ని ఎండగట్టింది. ఆ అంశాలను ప్రస్తావించకుండా కేవలం నివేదికలోని కొన్ని ఊహాజనిత అంశాలను సాకుగా చూపి ప్రాజెక్టుపై బురదజల్లేందుకు మంత్రి యత్నించారు.

పొంగులేటి మీటింగ్‌లో పవర్ కట్

- భూభారతి అవగాహన సదస్సులో నిలిచిన విద్యుత్తు సరఫరా
- అధికారుల తీరుపై మంత్రి అసహనం

కరంట్ పోవడంతో చీకటిగా మారిన సభావేదిక

కరీమాబాద్, ఏప్రిల్ 29 : మంత్రులు పాల్గొన్న సభలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఒక్కసారిగా చీకటిమయం కావడంతో మంత్రి అసహనం వ్యక్తంచేశారు. వరంగల్ జిల్లా ఉర్సు బైపాస్ రోడ్డులోని నాని గార్డెన్‌లో మంగళవారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో పాటు అధికారులు సభా వేదికపై ఉండగానే విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. చీకటిమయం కావడంతో అధికారులు హైరానాపడ్డారు. వెంటనే జనరేటర్ ఆన్‌చేసి కార్యక్రమం కొనసాగించాల్సి వచ్చింది. విద్యుత్తు అధికారులు వచ్చి సరఫరాను పునరుద్ధరించారు. కాగా, ఈ సభ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని తలపించింది. ఇద్దరు మంత్రులు, జిల్లా అధికారులు పాల్గొన్న కార్యక్రమంలో సభా వేదికపై కాంగ్రెస్ నాయకులు కూర్చోవడం చర్చనీయాంశంగా మారింది. అధికారిక కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఫొటో లేకుండానే అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కార్యక్రమం ప్రారంభానికి ముందే వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ రాజకీయ ప్రసంగం చేయగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అతడికి చురకలు అంటించారు. అధికారులు రాజకీయాలు మాట్లాడొద్దని, తాము మాట్లాడతామని సూచించారు.

'మిస్ వరల్డ్' పోటీలపై రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ): 'మిస్ వరల్డ్ 2025' పోటీల్లో పాల్గొనే అందాల భామలకు ఎక్కడా, ఎలాంటి అసౌకర్యం కలగకుండాచూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 7వ తేదీ నుంచి 31 వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లపై మంగళవారం పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. విమానాశ్రయం మొదలు కంటెస్టెంట్లు బస చేసే హోటళ్లు, పోటీలు జరిగే వేదికల వరకు ప్రతిచోట కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చారిత్రక, పర్యాటక ప్రదేశాలను కంటెస్టెంట్లు సందర్శించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

భద్రాద్రికొత్తగూడెం జిల్లా మహ్మద్‌నగర్‌లో రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న మహిళలు

ఇందిరమ్మ ఇండ్లన్నీ కాంగ్రెసోళ్లకేనా?

- నిరుపేదలు కనిపిస్తలేరా?
- ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెప్పినవారికే అందలం
- ఎమ్మెల్యే ఆదినారాయణ దత్తత గ్రామంలోనూ పేదలు దగా
- రోడ్డెక్కి నిరసన తెలిపిన ప్రజలు
- తనిఖీకి వచ్చిన అధికారుల అడ్డగింత

ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో తన పేరు లేకపోవడంతో జమ్మికుంట మున్సిపల్ కార్యాలయ భవనం ఎక్కి నిరసన తెలుపుతున్న దివ్యాంగుడు కోటేశ్వర్

నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 29 : కాంగ్రెస్ వాళ్లకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని, నిరుపేదలకు మొండిచేయి చూపారంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఆయా గ్రామాల ప్రజలు నిరసనలు వ్యక్తంచేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం నారాయణపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను తనిఖీ చేసేందుకు ప్రత్యేకాధికారి శివరాంప్రసాద్, కార్యదర్శి మహేశ్వరి రాగా నారాయణపురం, పెంచికల్‌పాడ్, నెమలిపేట, సూర్యంపేట, జగన్నాధపురం గ్రామస్థులు అడ్డుకున్నారు. పేదలకు ఇండ్లు మంజూరు చేసేవరకు సర్వే చేయొద్దని తేల్చిచెప్పారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దత్తత తీసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం మహ్మద్‌నగర్‌లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు రాలేదని అధికారులపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇందిరమ్మ కమిటీ చెప్పిన వారికే ఇండ్లు వచ్చాయని ప్రత్యేకాధికారి వినయ్, పంచాయతీ కార్యదర్శి శివపై మండిపడ్డారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వనంవారి కిష్టాపురంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అనర్హులను ఎంపిక చేశారని పంచాయతీ కార్యదర్శి, గుమస్తాను పంచాయతీ కార్యాలయం లోపల ఉంచి తాళం వేశారు. అధికారులే న్యాయం చేయాలి అని కోరుతూ ఖమ్మంరూరల్ మండల పరిషత్ కార్యాలయానికి ఆరెకోడు తండాకు చెందిన బాధితులు క్యూ కట్టారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లిలో ఇందిరమ్మ ఇల్లు రాలేదని కనకయ్య వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నంచేశాడు. నల్లగొండ జిల్లా చండూరు మండలం నెర్మటకు చెందిన పాలడుగు ముత్తమ్మ తనకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకుంటే మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఇంటిముందు ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ధీరావత్‌తండాలో పంచాయతీ కార్యదర్శి కార్యదర్శి సాయికుమార్‌పై కాంగ్రెస్ నాయకుడు పానుగోతు నాగరాజు తనకు తెలియకుండా గ్రామంలో ఎందుకు సర్వే చేస్తున్నావని దాడికి పాల్పడ్డాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాదిజమ్మికుంటకు చెందిన దివ్యాంగుడు దొంకటి కోటేశ్వర్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం పైకి ఎక్కి నిరసన తెలిపాడు. అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని ఆరోపిస్తూ కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సిరిసేడులో మహిళలు రోడ్డెక్కారు.